# కోటి విద్యలు

ⓢ

శ్రీ తురగా శేషగిరిరావు

[ పొట్టకోసము, ధనార్జనకోసము, 'కోటి' పన్నాగాలు పన్నుతారు. ఆ పన్నాగాలలో 'యిది' ఒక శాఖకు చెందుతుంది—ఈరకము మనుష్యులంతా సంఘానికి గౌరవనీయులు, సత్యసంధులు, దయార్ద్ర హృదయులు....వంచన, కుట్రలను సహించనివా డెవరయినా, యీ 'గోముఖ వ్యాఘ్రాల'ను, 'పయోముఖ విషకుంభాల'ను బయటికిలాగితే, లోకం ఆతనిమీద విరుచుకు పడుతుంది....నిజమాడితే నిష్ఠూరం....ఇక చదవండి !! ]

"తమరు దయదలిస్తే, ఒకబీద సంసారానికి దారి చూపగల్లరు"

"నాదయతో ఏమున్నదయ్యా! ఛైర్మన్ గారి దయవుండాలి—ఆ పరమాత్ముని దయవుండాలిగాని—"

"అట్లా సెలవివ్వద్దు. తమరు తలుచుకుంటేవ్వదో ఒక గట్టున పడేస్తారనే నానమ్మకము"

"నాచేత ఏమీ కాదని మొదటే చెప్పాను. మీరు మళ్ళీ మళ్ళీ విసిగిస్తే లాభములేదు."

"చిత్తము. మీరు ఒక్కసారి చెప్పిచూడండి. వీలుపడకపోతే నా దురదృష్ట మనుకుంటాను—అంతకంటే చేసే దేమున్నది?"

"చెప్పినా, మాట ఖాళీ అవడం తప్ప ప్రయోజనము ఉండదయ్యా బాబూ, అంటే మీరు వినరు."

"ఈ పేదవాని కోసము ఒక్కసారి శ్రమపడండి, మీ మేలు ఆజన్మాంతము మరచిపోను."

"అయితే సాయంత్రము, 5 గంటలకు కనపడండి"

"చిత్తము! అట్లాగే వస్తాను......నమస్కారము."

కామరాజు సంతోషముతో, జానకి రామయ్యగారికి నమస్కారము చేసి, బయటికి వచ్చాడు—మ్యునిసిపల్ సెకండరీ స్కూలులో తెలుగు మాష్టరు ఆరు నెలలు సెలవు పెట్టాడు. ఆ 'పోష్టు' కోసము కామరాజు ప్రయత్నము చేస్తున్నాడు. జానకి రామయ్య మ్యునిసిపల్ ఆఫీసులో 'హెడ్‌క్లర్కు'

"ఇదుగో! ఒక్కమాట" అని జానకి రామయ్య కామరాజును వెనక్కి పిల్చాడు. కామరాజు వెళ్లాడు.

"అయితే అసలు సంగతి మీతో దాచకుండా చెప్పి వేస్తున్నాను. ఇది ఎక్కడనైనా అనేవు సుమా! పీకలు కత్తిరించుకు పోతాయ్."

"ఎంతమాట! తమ రంతగా సెలవివ్వాలా ఏమిటి?"


"అయితే విను. మన ఛైర్మన్ గారికి దాహం పుచ్చుకునే అలవాటుంది."

"అంటే?"

"ఈ మాత్రము గ్రహించలేవుటయ్యా? బల్ల క్రింద చేయిచాచే అలవాటన్న మాట"

"ఆ!!"

"అలా తెల్లబోతా రెందుకు? ఇప్పుడు ప్రతి పెద్ద ఉద్యోగస్థునికి ఉన్న జబ్బేగాయిది."



వ్యాసకర్త

"చిత్తము! అయితే ఇప్పుడేమి చేయమని తమ సలహా?"

"మీతో మర్మము విడిచి చెబుతున్నాను. ఏమిటో చూచిన వేళా విశేషం. ఇంతవరకు నేనెవరితో యింత విపులంగా మాట్లాడలేదు. మిమ్మల్ని చూస్తే అదో విధమైన జాలిపుట్టి యీ విషయాలన్నీ చెబుతున్నాను."

"ఏదో మాబోటివారిమీద ఆమాత్రము అనుగ్రహమువుంటే, అదేమాకు పదివేలు."

"మీరు నాచేత నైనంత సహాయము చేసిపెట్టడానికేమీ అభ్యంతరములేదు—గాని..."

"కాని?" అని ఆదుర్దాగా ప్రశ్నించాడు కామరాజు.

"ఆ, ఏమీలేదు—ఎవరో వెంకట్రావులు. అతడు యింతకుముందే, యీపోష్టు కోసము, అప్లికేషను స్వయంగా పట్టుకుని వెళ్లి చైర్మన్ గారి కిచ్చాడు. పైగా అతడు 'గ్రాడ్యుయేట్'ట కూడాను అతడు చైర్మన్ గారిని సంతృప్తి పరిచాడు కాబోలు—అతనికే తప్పకుండా 'ఆర్డరు' వేయాలని చైర్మన్ గారు గట్టిగా చెప్పారు.

ఎలాగో అలా. మీతరఫున వాదిద్దామన్నా, మీరు 'గ్రాడ్యుయేట్' కూడా కాదాయెను—ఎట్లాగా అని ఆలోచిస్తున్నాను."

"ఈ పదిహేను రూపాయల ఉద్యోగంకోసము పట్టభద్రులు కూడా అప్లికేషను పెట్టారా?"

"ఆ! పదిహేను రూపాయలు కోసమా, అంటున్నారే? పది రూపాయలకు కూడా సిద్ధపడే గ్రాడ్యుయేట్లు మాత్రం లేరూ?"

"అయితే తమ అభిప్రాయ మేమిటి?"

"ఏమీలేదు. ఆ వెంకట్రావు చైర్మన్ గారికి కొద్దో గొప్పో ముట్టచెప్పే వుంటాడు. అతనికన్నా మీరే మైనా ఎక్కువ ముట్టచెపితే పని సానుకూలమవుతుంది—లేకపోతే లేదు. నాకుమాత్రము మీరేమి యివ్వ నక్కరలేదు. చైర్మన్ గారిని సంతోష పెట్టండి అంతే."

"అయితే ఏమాత్రము యివ్వాలిసి వస్తుంది?"

"అధమం పాతికైనా లేనిదే పని జరగదు."

"అమ్మో!! నెలకు 15 రూపాయల జీతము. ఆరునెలల ఉద్యోగం—దానికిగాను పాతిక రూపాయలు, లంచమా! ఎక్కడైనా సబబు ఉందండీ?"

"ఆరునెల లేమిటి?—ఆ సన్యాసి అప్పుడేవచ్చి ఏడుస్తాడూ? ఎటులేదన్నా, యిదిగాక యింకా ఆరునెలలయినా సెలవు పెడుతాడు. అప్పుడు కూడా మిమ్మల్నే ఉంచుతాంగా."

"ఏమో? ఎవరు చెప్పగలరు? ప్రస్తుతం ఆరు నెలలేగా సెలవుపెట్టింది... కానియ్యండి ఒక్కనెల జీతము మాత్రం నేను యివ్వగలను. దానివల్ల పనిసానుకూలమైతే చూడండి. లేకపోతే, రాం రాం"

"సరే! సాయంత్రము పట్టుకురండి."

◆ ◆ ◆

"బాబుగారూ! నమస్కారము"

"దయచేయండి...ఏమి పనిమీద వచ్చారు?"

"స్కూలులో ఏదో, తెలుగు మాష్టరు పని ఖాళీ ఉందని తెలిసింది— అప్లికేషను పెట్టుదామని ......"

"తమ పేరు?"

"రామచంద్రరావు"

"అయితే, ఇంతకుముందే, ఎవరోవచ్చి వెళ్ళారు. ఆయన పేరు కామరాజుగారు—వారికి తప్పకుండా యిస్తామని చైర్మనుగారు వాగ్దానము చేసారుకూడాను—ఇదిగో. ఆయన పెట్టిన అప్లికేషను. ఈ పరిస్థితుల్లో మీరు ప్రయత్నించినా, శ్రమతప్ప, లాభ మేమాత్రం వుండదు."

"చిత్తము. మీరు అనుకుంటేచాలు. ఎలాగో బాగా చూడగలరు."

"ఈ ఉత్త 'అనుకోడాలు' వల్ల ప్రయోజనము లేదయ్యా—ఈపరిస్థితుల్లో మీకే యీ ఉద్యోగం రావలంటే, ఒకటే చక్కని వుపాయముంది"

"సెలవివ్వండి"

"చైర్మన్ గారికి ఏదో కొంత ముట్టచెపితే సరి—క్షణాలమీద, ఆర్డరువచ్చి పడుతుంది."

"ఆహా!! అయితే ఎంతలో ఉంటుందంటారు?"

"ఇరవై రూపాయలైనా ఉంటేనేగాని..."

"బాబోయ్! అంత అయితే భరించడం కష్టము—ఈ పది రూపాయలు వారికిచ్చి. ఏదోవిధంగా, పని చక్కచేయండి"

"...సరే! రేపు ప్రొద్దున కనపడండి."

◆ ◆ ◆

"జానకి రామయ్యగారున్నారా?"

"ఆ! ఎవరది?...వస్తున్నా... ఓహో! కామ

రాజుగారా!...... దయచేయండి— డబ్బు పట్టుకొచ్చారా?"

"ఆ! తమరు చెప్పిన తరువాతకూడా అశ్రద్ధ చేస్తానా?...ఇదుగో."

"..............."

"ఎలాగో అలామనకే ఆర్డరు పడేటట్లు చూడండి."

"మీకెందుకు? రేపీపాటికల్లా ఆర్డరు రాకపోతే అప్పుడు అడగండి."

"ఈ చక్రకేళీగెల లోపల పెట్టించండి... ఇంక నేను శెలవు పుచ్చుకుంటా"

"సరే! పోయిరండి"

♦ ♦ ♦

"ఏమేవ్! ఈలారా. ఈ సొమ్ముతీసి జాగ్రత్త చెయ్యి."

"..............."

"లెక్క పెట్టావా?"

"ఆ. మొత్తము నలభై రూపాయలున్నాయి— ఎక్కడివండీ"

"ఎక్కడి వేమిటి? కష్టార్జితం."

"చెప్పుదురూ! ఆటే చంపక"

"ఆడవాళ్ల నోట్లో నువ్వుగింజదా గదు"

"ఫరవాలేదు. చెప్పండీ"

"స్కూలులో తెలుగు మాష్టరు పని ఖాళీ వచ్చింది"

"వస్తే?"

"సాంతం విను—దానికి తలమాసిన వాజమ్మలందరూ ధరఖాస్తు పెట్టుకున్నారు."

"ఊ!"

"చైర్మనుగారి కేదయినా ముడుపు చెల్లించవలసి వస్తుందని వాళ్లతో చెప్పాను— ఆ వాజమ్మలంతా నమ్మారు."

"వాళ్లు యిచ్చారన్నమాట"

"విను మరీ! మధ్యలో అడ్డప్రశ్నలు వేస్తే చిరాకెత్తుతుంది—అందులో ఒకడు పదిరూపాయలు, యింకో సన్యాసి పదిహేనురూపాయలు—మరోయిద్దరు—ఒకడు అయిదు, యింకోకడు పది, రూపాయలు యిచ్చారు."

"చైర్మన్ గారికి లంచమివ్వవు నేనా?"

"మరి యింకెందు కనుకున్నావ్?"

"అది కాస్తా మీరు భుక్తం చేసుకున్నా రన్నమాట. గొప్పపనే చేశారులెండి!— అయితే చైర్మను గారు వీళ్లలో ఎవ్వరికీ ఉద్యోగం యివ్వకుండా, పరాయివాడికిస్తే ఏమిచేస్తారు? వీరందరూ తిరిగి మిమ్మల్ని డబ్బివ్వమని పట్టుకోరూ?"

"పిచ్చిదానా! పామునోట్లో పడ్డది తిరిగి వస్తుందా, ఏమిటి?... చైర్మను, పరాయివాడి కిచ్చుకుంటే యిచ్చుకోనీ!—వీళ్ళు నలుగురూ నెత్తిన గుడ్డ వేసుకొని యేడుస్తూ పోతారు. వాళ్లకర్మానికి మనమేం చేస్తాం?"

"బాగానేవుంది, మీ వేదాంతం—సొమ్ము మీరు తీసుకొని, అనుభవించడ మేమిటి—వాళ్లు ఏడవడ మేమిటి?"

"జ్ఞాను. మరీ! కోటి విద్యలు కూటికొరకే" అని నవ్వుతూ జానకి రామయ్యలోనికి వెళ్ళాడు, భార్యకూడా అతని ననుసరించింది.


## SEXUAL LOVING BOOKS

Sexual Beauty of the Female from thoroug by illustrated with 185 Photos, Rs. **4-8-0.** Sex Pictorial with Hundreds of Pictures. It contains 21 Chapters and also special secret pictures. Sealed in the end Rs. **4-8-0**



*Sex and the Girl of 18* It describes frankly everything pertaining to female sex, Sexual Love etc., with 40 illustrations Rs. **2**

*Rati Sastra:* This book contains a number of Sexual secrets and its vivid illustrations Rs. 1-12-0

*Sex Orgains in Woman* Illustrated „ 0-12-0

*Hidden Exercises of Enjoyment* Illustrated „ 0-8-0

*Secrets of Sexual Science* Illustrated „ 0-8-0

*Hidden Powers in Man 500 Pages* „ 2-8-0

*Secret of Sexual Bliss* Illustrated „ 1-0-0

*Female Sex Organ* Illustrated „ 0-8-0

**T. R. ROYAL & CO.,**

**3, Krishnappa Naick Tank Street, G. T., MADRAS**